

# ఎన్నాళ్లీ దాస్య శృంఖలాలు?

సూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ

రావూ, దేవీ ఆరోక్లాసు మొదలుకుని యెంతో అన్యోన్యంగా చదువుకుంటూవొచ్చారు. వారిద్దరూ ఒహరొన్నొకరు హాస్యాలాడుకునేవారు. ఒకరికిలేని నోట్సు లింకొకరు సర్దియిచ్చేవారు. ఒకరికిరాని పాఠా లింకొకరు బోధపరిచేవారు. క్లాసులో ఒహరుయేడుస్తోంటే మరొహరికి అకస్మాత్తుగా కన్నీళ్లురాలిపోయేవి. ఇలా ప్రేమాతిశయాల్తో కాలచక్రాన్ని గిర్రునత్రిప్పుకుంటూ తయారయి కూచున్నారు స్కూలు ఫైనలు పరీక్షలకి.

దేవి ఆవూళ్లో ఓడాక్టరుగారమ్మాయి. రావు తను ఆరోక్లాసు చదువుతూండేప్పుడు హిందీ నేర్చుకోటానికి వారింటికి వస్తూ పోతూ ఉండేవాడు. వాళ్ళయింట్లో అతను మూడేళ్ళపాటు యెంతో చనువుగా తిరుగుతూండేవాడు. దేవి, రావూ, యిద్దరూ ఆటల్లోనూ పాటల్లోనూ కలిసిమెలిసి వుంటూ పరీక్షల్లో యెవ్వరికీరాని ఎక్కువమార్కుల్ని సంపాయించుకునేవారు. దేవితల్లిదండ్రులుకూడా అతన్ని సొంతకొడుక్కిమల్లే పిలుస్తూ ప్రేమిస్తూండేవారు. కాని అదంతా పసితనం.

స్కూలు ఫైనలు పరీక్షలోగూడా వీరిద్దరూ అన్నాచెల్లెలికి మల్లే తిరుగుతూ రాత్రీపగలూ కష్టపడి చదువుకున్నారు. పసితనంలో వారిమనసుల మధ్య నాటుకుపోయిన సోదర ప్రేమ మాత్రం అంతకంతకు పెరుగుతూవొచ్చింది. "అన్నయ్యా" అని తర్కించుకునేది దేవి. "చెల్లి" అని అంతరాత్మలోనే పిలుచుకునేవాడు రావు. కాని వారి మనోభావాలు మాత్రం లోకానికి తెలీవు. ఆఖరికెలాగో యిద్దరూ స్కూలు ఫైనలుపరీక్షలో మంచి మంచిమార్కుల్తో పాసయ్యారు.

వారిద్దరిలోనూ యవ్వనాంకురా లిప్పుడిప్పుడే చిగురెత్తున్నై. అయితేమాత్రం? వారు పెరుగుతూన్న కొద్దీ ఆసోదరప్రేమకి వారిహృదయాలు అడ్డుచెప్పలేకపోయినై.

ఇహాకళాశాల-కొన్ని కొన్ని ఆర్థికవిషయాలకి గురయి రావు అంతటితో తనచదువుకి స్వస్తిపలికాడు. కాని దేవిమాత్రం కాకినాడకాలేజిలో ప్రవేసించింది. తనచెల్లెలితో పూర్వంలాగా చదువుకునే మహాభాగ్యం లేకపోయిందిగదా అని రావు యెన్నోమార్లు తనంతటతానే యేడ్చుకునేవాడు. అయినా విధిలిఖితాన్ని యేం చెయ్యగలడు? — కావలసిందేదో కానే అయింది. రావు ఓ ఆఫీసులో గుమస్తాగిరీకి ప్రవేశించాడు.

దినాలు త్వరత్వరగా జారిపోతున్నై. మరో మూడునెల్లయ్యేక రావుకి కాకినాడదాటి యేదో వూరికెళ్లాల్సిన అగత్యం పడింది. తనచెల్లెలి చదువేనా చూసి దుఃఖస్రవంతుల్ని దిగమ్రింగుకుని ఆనందించే మహాభాగ్యం ఆనాడుకలిగిందిగదా అని తన్మయుడై పోయాడతను. చెల్లెల్ని పరామర్శించుదామని మహా ఉబలాటపడ్డాడు. చెల్లెలికెన్నో బహుమానాలు తీసుకెళ్దామని యెంతో సరదా పడ్డాడు-అందుకు దేవికూడా ఆనందలహరినిపొంగజేస్తూ అన్నయ్యని ప్రేమార ఆహ్వానించింది. కాని దేవుడు ఆఅన్నాచెల్లెళ్ల ఆశయాలను

ఓర్వలేకపోయే దుర్మార్గుడయాడు. బహుశా వారి సోదర ప్రేమనుచూచి తక్కిన క్రూరమానవులకు మల్లే తనూచూడలేక అనుమానించాడేమో! అక్కడ అన్నయ్య వస్తాడుగదా అని యెదురు తెన్నులు చూస్తూవుంది దేవి-ఇక్కడకొన్ని కారణాంతరాలవల్ల రావు కాకినాడలో దిగలేక పోవటం తటస్థించింది అందుకు తన విచారం తెలియపరస్తూ అతను క్షమాపత్రాన్ని రాసివేడుకున్నాడు. దేవి కన్నీటి కాలవలు పారిస్తూ సెలవులకు వొచ్చినప్పుడు ఇంటిదగ్గర కలుసుకోమని జవాబు వ్రాసింది.

ఇంతలో దసరా వొచ్చేసింది. సెలవులకు దేవివాళ్లయింటి కొచ్చింది. రావు యెంతో ఆత్రంతో గబ గబా వారింటికెళ్లాడు కాని అతనికి అక్కడ పూర్వముండే శోభకనిపించలా. అతన్నిచూసి దేవి ఎక్కడో దాక్కునేది. అతనికిదేమీ అర్థమయిందికాదు. తనమనసు ఆమెనుచూసి పరామర్శించాలని ఆత్రంతో తహ తహలాడ్తోంది. 'ఏమోయ్! బాగున్నావా?' అనిపలుకరిస్తుందిగదాఅని పుట్టెడాశపడ్డాడాతను. పలుకరించటం మాటపోనియ్యండిగాని దేవి అతనికంటికేనా కనిపించలేదు. ఏం?— అంతప్రేమగా చూస్తూండే దేవికి తన పూర్వపు అన్నయ్యమీదనా ఆసిగ్గు? కాదు, కాదు. మానవపిశాచాలకు జడిసి ఆమె అట్లా జంకిపోయింది. స్త్రీల హృదయం దూదికన్న మెత్తన! కాస్తగట్టిగా కసిరేచాలు; గుండెలేమూలకో పారిపోతాయ్. రావుకీ దేవికీమధ్య ఉత్తరాలు నడిచాయని ఆమెతలిదండ్రులకు తెలిసింది ఆమెనాన్నగారి హృదయంలో రేగిందొక భయంకరమైన తుపాను! పూర్వం తనసొంత కుమారుడికిమల్లే ఆప్యాయంగా చూసుకున్న రావుని లవలేశమూ విశ్వసించలేక పోయాడు. ఆయన వీరిద్దరిలో యేదోరహస్యం వుండి తీర్తుందని అనుమాన పడ్డాడు. అది ఈనాటి ప్రతిమానవుడికీ మనదేశంలో పరిపాటేగా! వెంటనే ఆయన కుమార్తెని మందలించాడు. తనకిక ముందెప్పుడైనా అలాంటిది తెలిసిందంటే చదువుమానిపించేస్తానని బెదరించాడు. పాపందేవి వొణికిపోయింది. ఆమెకు చదువుకుందామని అభిలాషయెక్కువ. ఈమధ్యని తనచదువుకెక్కడ అంతరాయం కలిగిస్తాడో అని భయపడింది. సామాన్యస్త్రీయైపుట్టి ఒకసోదరుడికి తనయోగక్షేమాలు రాసుకుందుకేనా స్వాతంత్ర్యంలేనిజీవి తమాయని కుమిలి పోయిందిదేవి రావునుకూడ ఆమెనాన్నగారు యిటుపైని ఉత్తరాలేవీ రాయొద్దని శాసించాడు. మునుపటి ఉత్తరాలన్నీ తనిఖీచేశాడు. అంతకీ మనసుమారిందికాదు. ఏంచేస్తారు పాపం ఆనిర్భాగ్య జీవులు- లోకానికి కళ్లులేవు. వారిద్దరిమధ్యనూ ఊగులాడ్తూండే భావపరంపర లానాటినుంచి తెగిపోయినై. వారిప్రేమాభిమానాలకి అవరోధం యేర్పడింది. వారి సోదరప్రేమవాహినికి అడ్డంగా ఓ ఆనకట్టు కట్టేసిన ఆమానవరాక్షసుల నేమనిపిలవాలో తెలీటంలేదు. పాపం-ఆ అన్నాచెల్లెళ్లిద్దరూ మనసులలోనే వారిప్రతిమల్నినిలుపుకొని తలంపుకొచ్చినప్పుడల్లా కుమిలి కుమిలి యేడుస్తుంటారు. ఓస్త్రీకి తను ఉత్తరం రాసుకునే పాటి స్వాతంత్ర్యమేనా యివ్వనినాడు వారంతాపైకి వృద్ధిలోకిరావాలంటే యేలావస్తారు? వంటయిల్లే ప్రపంచంగా ఆడవాళ్లు గుర్తించుకునే కాలంపోవాలంటే లోకంచెయ్యాల్సిన కర్తవ్యం, యిదేనా?-ఎందరు సోదరీ సోదరు లిలాంటి మానవసంఘ క్రూర నిబంధనలకి దాసులై పోతున్నారోగదా! ఈమానవరూప రాక్షసుల దృష్టి పడ్తూండగా యిద్దరు స్త్రీపురుషులు అన్నాచెల్లెళ్లయినా సరే, కాస్సేపు మాటాడుకో రాదు-నవ్వుకోరాదు-యోగక్షేమాలురాసుకోగూడదు. యీనాడు వ్యభిచారుల్నిపూజిస్తోంది, గౌరవిస్తోంది-అన్నాచెల్లెళ్ల సోదర ప్రేమనుమానించి అపవాదు వేస్తోంది. ఇదేనాలోకం!- ఇదేనా లోకకళ్యాణానికి మార్గం?-ఇదేనా సోదరమానవులు చెయ్యాల్సిన కర్తవ్యం?-ఇంతకూ యెన్నాళ్లీ దాస్యశృంఖలాలు?—

---